క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని నాయిడివాడ పంచశిల్పి విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా పొలాస భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సుముఖం అభిషేక్, కోశాధికారిగా సింహారాజు విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను కట్ట నాగాచారి పర్యవేక్షించారు.

శ్రీనగర్ కాలనీ కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

మామడ: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా గంట భూమేశ్, ప్రధాన కార్యదర్శిగా మాలెపు విష్ణు, కోశాధికారిగా అంగూరి తిరుపతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పెంటు శ్రీనివాస్‌ప్రసాద్, బ్రహ్మయ్య, గంగాప్రసాద్, భీమేశ్వర్ వ్యవహరించారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని కడ్తాల్ 44వ జాతీయ రహదారి సమీపంలో పశ్చిమ ముఖ ద్వారంగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఆదివారం ధ్వజస్తంభం (ఏకశిల)ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి సత్యనారాయణ గౌడ్ దంపతులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బర్మరాజ నరసయ్య, మంజులాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బి.గంగాదాస్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బర్మ రవీందర్, పలువురు నాయకులు భీమేశ్, కె.లక్ష్మారెడ్డి, మద్దెల గంగాధర్, గుర్రం ఆశన్న, బర్మ శ్రీకాంత్, పూజారి రాజేశ్వర్, అంకం రవి, గుర్రం గంగన్న, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన స్తంభాలు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని ఐదోవార్డు పరిధి ఇంద్రానగర్‌లో నూతన స్తంభాల ఏర్పాటు పనులను ఆదివారం ప్రారంభించారు. కాలనీలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని గతంలో మాజీ కౌన్సిలర్ పరిమి లత సురేశ్ విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన విద్యుత్ అధికారులు పాత స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గణేశ్, రమేశ్, లాలు, మధు, లక్ష్మీనారాయణ, విలాస్ తదితరులు ఉన్నారు.

రక్షాబంధన్ వారోత్సవాలు

నిర్మల్‌టౌన్: రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని శెట్‌పెల్లి అరుణ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షాబంధన్ వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నిర్మల్‌లోని దివ్యనగర్ వశిష్ఠ యోగ శిబిరంలో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులకు, గాంధీచౌక్‌లోని మురళీకృష్ణ ఆలయం, నందిగుండం దుర్గామాత ఆలయాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. రక్షాబంధన్, గాయత్రి మంత్రం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో దుర్గామాత ఆలయ వ్యవస్థాపకులు కొండుజి వెంకటాచారి, వశిష్ఠ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేష్ సింగ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పోలిశెట్టి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


దిగంబర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ సిందె దిగంబర్ పటేల్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన కన్వీనర్‌గా ఎంపికవగా మండలంలోని కల్లూరు గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, రజనీకాంత్, బబ్లూ, శ్రీను, నవీన్‌రెడ్డి, దత్తాద్రి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

‘సరస్వతి’కి నీళ్లు వచ్చేదెప్పుడు?

- అయోమయంలో రైతులు
- ఇప్పటికే వరినార్లు పోసుకున్న వైనం
- ఆయకట్టు పరిధి 33,622 ఎకరాలు


నిండని వద్యాల్ చెరువు


నీళ్లు రాక వద్యాల్ వద్ద వెలవెలబోతున్న సరస్వతి కాల్వ

లక్ష్మణచాంద: వానాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా.. ఇప్పటివరకు జిల్లాలో భారీ వర్షాలు కురువలేదు. దీంతో వర్షాలను నమ్ముకొని పలుచోట్ల వరినార్లు పోసుకున్న రైతులు.. సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా రైతులకు కీలకంగా మారిన సరస్వతి కాల్వ నుంచి సాగునీటి విడుదలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో రైతులు వరినాట్లు వేయాలా.. వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు. పలు చోట్ల చెరువులు కూడా పూర్తిగా నిండలేదు. దీంతో చెరువు ఆయకట్టు పరిధి రైతులు సైతం వరి సాగుకు వెనుకంజ వేస్తున్నారు.

జిల్లాలో 33,622 ఎకరాల ఆయకట్టు...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే సరస్వతి కాల్వ ఆయకట్టు పరిధి జిల్లాలో 33,622 ఎకరాలు ఉంది. ఈ కాల్వ ప్రధానంగా నిర్మల్‌రూరల్, సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, పెంబి, కడెం మండలాల్లో ప్రవహిస్తుంది. మొత్తం 28 డిస్ట్రిబ్యూటరీలు కలిగిన ఈ కాల్వ జిల్లాలోని ఏడు మండలాల్లో 47 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. నీరు విడుదలైతే జిల్లాలోని ఏడు మండలాలకు సాగునీరందింది.. తమకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

వరినాట్లు ఆలస్యం..

ఏడు మండలాలల్లో ఉన్న సరస్వతి కాల్వ నుంచి నీరు విడుదల కాకపోవడంతో వరినాట్లు ఆలస్యం అవుతున్నాయని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే నారు పోసి 45 రోజులు దాటిందని.. ఆలస్యమైతే నాట్లు వేయడం కష్టమవుతుందని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లో నాట్లు వేయకుంటే నారు పనికి రాకుండా పోతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.


నాట్లు వేయని ఆయకట్టు పొలాలు

నిర్వహించని 'కాడా' సమావేశం...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1078 అడుగుల నీరుంది. ప్రాజెక్టు ఎగువన కురిన వర్షాలతో 40 టీఎంసీలు చేరినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా 1070 అడుగుల నీళ్లు రాగానే నీటిని విడుదల చేసే అధికారులు 1078 అడుగులకు చేరినా.. ఎలాంటి ప్రకటన చేయడం లేదని రైతులు అంటున్నారు. వానాకాలం నీటి విడుదలపై ప్రతి సంవత్సరం నిర్వహించే కాడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)సమావేశం గతంలో జూలై మాసంలోనే నిర్వహించేవారని.. ఈసారి ఆగస్టు మొదటివారం వచ్చిన సమావేశం జరగలేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో జిల్లాకు సాగు నీరు విడుదలవుతుందో లేదో పరిస్థితి నెలకొంది.

నీటిని విడుదల చేయాలంటున్న రైతులు..

వరి నార్లు పోసుకొని నీటి కోసం వేచిచూస్తున్నామని ఆయకట్టు పరిధి రైతులు పేర్కొంటున్నారు. నీరు విడుదల చేయకుంటే పెట్టుబడులు నష్టపోతామని.. ఉన్నతాధికారులు స్పందించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

సందిగ్ధంలో ఉన్నా..



మాది లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్ గ్రామం. నాకున్న రెండెకరాతోపాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నా. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి నార్లు పోసుకున్నా. వరినారు నాటుకు ఎదిగింది. ఇప్పటికీ సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయలేదు. ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో ఉన్నా.

– కల్యాణ్, యువ రైతు, బాబాపూర్

నీటిని విడుదల చేయాలి



ఎనిమిది ఎకరాలలో వరి సాగు చేస్తున్నాను. ఇటీవలి వర్షాలకు రెండు ఎకరాల్లో నాటు వేశా. సరస్వతి కాల్వ నుంచి నీరు విడుదలైతే మిగతా 6 ఎకరాలు నాటు వేస్తాం. అధికారులు స్పందించి త్వరగా సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయాలి.

– సాధిక్, యువ రైతు, బాబాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాం

సరస్వతి కాల్వకు నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఇప్పటివరకు నీటి విడుదలపై ఎటువంటి సమాచారం రాలేదు. ప్రభుత్వం అనుమతిస్తే నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

– శ్రీకాంత్, ఏఈ, నీటిపారుదలశాఖ

శివాలయానికి నిధులు మంజూరు


ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

కుంటాల: మండలంలోని లింబా(బి)గ్రామంలో శివాలయ నిర్మాణం కోసం దేవాదాయ శాఖ నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పరిశీలన


సర్వే పరిశీలిస్తున్న ఎంపీవో రహీంఖాన్

కుంటాల: ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆదివారం కుంటాలలో ఎంపీవో రహీంఖాన్, సిబ్బంది సేకరించారు. మండలానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 361 ఇళ్లు, రాష్ట్ర ప్రభుత్వం 31 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆధార్ వివరాలతోపాటు వారు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేను ఎంపీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది దిలీప్ తదితరులు ఉన్నారు.

పచ్చ బంగారానికి తెగుళ్ల ముప్పు

- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా ఉద్యానశాఖ అధికారి రమణ


డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి

లోకేశ్వరం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలపై పచ్చ పురుగు ప్రభావం తీవ్రంగా ఉంది. ఇప్పటినుంచే పసుపు పంటకు మర్రాకు తెగుళ్ల సోకుతుంది. రైతులు పంటను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉంటూ తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి జిల్లా హార్టికల్చర్ అధికారి(ఉద్యానశాఖ) డీవీ రమణ వివరించారు.

దుంపకుళ్లు..

పసుపు పంట చేనులో అధికంగా నీరు నిల్వ ఉంటే దుంపకుళ్లు సోకే ప్రమాదం ఉంది. ఎప్పటికప్పుడు మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం లేని భూముల్లో ఎక్కువగా ఇది సోకుతుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించకుంటే దుంపకుళ్లు సోకే ప్రమాదం ఉంది.

లక్షణాలు..

- పంట చేనులో అక్కడక్కడ మొక్కల ఎదుగుదల నిలిచిపోతుంది. జీవం లేక వాటి ఆకులు లేత పసుపు రంగుకు మారి నీటితడులు అందించినా మొక్కలు ఎండిపోతాయి.
- తొలుత మొక్క ముదురు ఆకులు వాడి గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. ఈలక్షణం క్రమేపీ కింద భాగంలో ఉన్న పైనున్న లేత ఆకులకు సంక్రమిస్తుంది.
- మొక్క కాండంపై నీటిలో తడిసిన మాదిరి మచ్చలు ఏర్పడతాయి. మచ్చలు తర్వాత గోధుమ రంగుకు మారుతాయి.
- మొక్క లాగితే భూమట్టానికి ఊడి వస్తుంది. పిలకలు వాలి ఉంటాయి.
- భూమిలో దుంపలు కొమ్ములు కుళ్లి లోపల మెత్తబడతాయి. పంట దిగుబడి తగ్గేందుకు ఇది ప్రధాన కారణం.
- కుళ్లిన దుంపలు, కొమ్ములు వాసన వస్తాయి.


వట్టోలిలో సాగవుతున్న పసుపు పంట

నివారణ చర్యలు..

దుంపకుళ్లు తెగులు నివారణకు ఎకరాకు 600 గ్రాముల కడ్లెట్, 100 గ్రాముల కొరాజిన్ కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. ట్రైకోడర్మ, పీఎస్‌బీ సూడోమోనాస్‌ను బాగా మాగిన పశువుల ఎరువులో 10 రోజులు కలిపి ఉంచిన మిశ్రమాన్ని చేనంతా చల్లాలి.

మర్రాకు తెగుళ్లు ..

తెగులు సోకిన పంట నుంచి విత్తనం వాడితే మర్రాకు తెగుళ్ల అధికంగా వ్యాపిస్తుంది. గాలిలో ఎక్కువ తేమ.. తక్కువ ఉష్ణోగ్రత గాలిలో ఉండటం వలన వస్తుంది. సమతుల్య సమగ్ర ఎరువులను వినియోగించకుంఆ పంట అవశేషాలను చేను చుట్టూ ఉంచితే ఇది తొందరగా వ్యాపిస్తుంది.

లక్షణాలు :

- మొక్క ఆకులపై అండాకారాపు పెద్ద పెద్ద మచ్చలు ఏర్పడుతాయి. మచ్చలు పెరిగి గోధుమ రంగుతో ఉంటాయి. మచ్చ చుట్టూ పసుపు రంగు వలయం ఉంటుంది.
- ముదిరిన మచ్చల్లో గుండు సూది మొన పరిమాణంలో నల్లటి శిలీంధ్ర బీజాలు క్రమ వలయంలో ఉంటాయి.
- ఆకు కాడపై మచ్చలు ఏర్పడి ఆకు వాలిపోతుంది.

నివారణ చర్యలు..

మర్రాకు తెగుళ్ల నివారణ కోసం ఒక్క గ్రాము కార్బండిజం లీటరు నీటితో.. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా 1 మిల్లీ లీటర్లు ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి చేనులో పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు చేపట్టాలి.

పాదయాత్రకు తరలిన నాయకులు


కడెం నుంచి వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు


లక్ష్మణచాంద నుంచి వెళ్తున్న నాయకులు

కడెం: ఖానాపూర్ మండలంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిర్వహించిన జనహిత పాదయాత్రకు మండలంలోని యూత్ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక వాహనాల్లో ఖానాపూర్ చేరుకున్నారు.

లక్ష్మణచాంద: ఖానాపూర్‌లో చేపట్టిన జనహిత పాదయాత్రకు లక్ష్మణచాంద మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఇందులో నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు రజనీకాంత్, రవి, సురేశ్ ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.

లోకేశ్వరం: జనహిత పాదయాత్రలో పాల్గొనేందుకు లోకేశ్వరం మండలకేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి మండలంలోని సమస్యలు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, ముధోల్ ఆత్మ చైర్మన్ గన్ను సర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


లోకేశ్వరం నుంచి వెళ్తున్న నాయకులు

వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న ఉత్తమ్‌కుమార్

దిలావర్‌పూర్: మండలకేంద్రమైన దిలావర్‌పూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఐఐఎఫ్ సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఉత్తకుమార్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం కేజీబీవీలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు రమేశ్, శ్రీధర్, మాజీ సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, శైలేశ్వర్, నర్సయ్య, రవి, సుభాశ్ పాల్గొన్నారు.

అల్లుకుంటున్న నిర్లక్ష్యం


జామ్ గ్రామంలో ఎస్సీ వసతిగృహం వద్ద..

సారంగపూర్: తీగజాతి మొక్కలు విద్యుత్ స్తంభాలకు అల్లుకుంటూ కరెంట్ సరఫరాకు అంతరాయం కల్గిస్తున్నాయి. మండలంలోని అడెల్లి గ్రామ సమీపంలోని హైలెవెల్ కాల్వ వద్ద వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్, జామ్ గ్రామంలో ఎస్సీ వసతిగృహం సమీపంలో, శుభగడియలు ఫంక్షన్ హాల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లపై మొక్కల తీగలు అల్లుకుంటున్నాయి. ఈ తీగలకు విద్యుత్ సరఫరా అయితే మూగజీవాలతోపాటు మానవులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి తీగజాతి మొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


హైలెవెల్ కాల్వ వద్ద..

దేగాం యువకుడికి డాక్టరేట్


కైలాశ్‌కు పీహెచ్‌డీ పట్టా అందిస్తున్న ఆనంద్ మహీంద్రా

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి సింగారపు కైలాశ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను ఆదివారం హైదరాబాద్‌లో అందుకున్నారు. మహీంద్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసి చైర్మన్ ఆనంద్ మహేంద్ర చేతుల మీదుగా పట్టాను అందుకున్నందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కై లాశ్ ప్రస్తుతం ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఎండీ జీ.వి.ప్రసాద్, వైస్ ఛాన్సలర్ యాదులు మేడురి, దేగాంకు చెందిన ప్రకాశ్ పాల్గొన్నారు.

‘విద్యారంగ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం’


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

ఖానాపూర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పట్టించుకోకుండా జనహిత పాదయాత్రల పేరిట కాలం వెళ్లదీస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.8500 కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే పాదయాత్రలు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్, ఇతర సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు కై రి శశిధర్, దినేశ్, దుర్గాప్రసాద్, సాయికుమార్, దశరథ్, శశాంక్, మహేంద్ర, పవన్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


ఖానాపూర్: అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని 11వ వార్డు 233వ బూత్ పరిధి నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని మోడీ 11 ఏళ్ల పాలనలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. మోడీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎనగందుల కుమార్, అనిల్‌రావు, మదిరె శ్రీనివాస్, దానిపెల్లి సుధాకర్, ఎనగందుల నారాయణ, బి. రాజేందర్, వడ్లకొండ భూమన్న, నారాయణ, రాజేశ్వర్, రంజిత్ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి


భైంసారూరల్ : దేగాంలో..

భైంసారూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో జనసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ 18 నెలల్లోనే నియోజకవర్గానికి ఎన్నో పనులు చేశారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి నరేశ్, సాయినాథ్, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: మండలంలోని డ్యాంగాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. అండర్–14 షాట్‌పుట్ విభాగంలో కృష్ణ, లాంగ్ జంప్‌లో ప్రకాశ్, 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రదీప్, అండర్–16 షార్ట్‌పుట్‌లో సాయినాథ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరి ఎంపికపై జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ, ఏసీఎం ఓ శివాజీ, హెచ్ఎం శైలజ, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రేపు క్రీడల నిర్వహణపై సమావేశం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 69వ ఎస్జీఎఫ్, తెలంగాణ రాష్ట్ర క్యాలెండర్ 2025–26 కోసం జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల క్యాలెండర్ రూపకల్పన చేస్తారని పేర్కొన్నారు. జిల్లా క్రీడా సమాఖ్య, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని తెలిపారు. వివిధ క్రీడా పోటీలను నిర్వహించడంలో ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్‌లు సమావేశానికి తమ పాఠశాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూడాలని డీఈవో పేర్కొన్నారు.